సాక్షి
వికారాబాద్

ఆదివారం । 4 । ఫిబ్రవరి । 2024



సర్వం కల్తీమయం..

ధనార్జనే ధ్యేయంగా కొందరు వ్యాపారులు పరిగి కేంద్రంగా కల్తీ ఆహార పదార్థాలను యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. 8లో▸



సంతలో సెల్‌ఫోన్ల చోరీ

ధారూరు వారాంతపు సంత అంటే.. సహజంగానే వ్యాపారులు, వినియోగదారులతో కిక్కిరిసిపోయి ఉంటుంది. 8లో▸



డేంజర్ టర్నింగ్స్!

బషీరాబాద్ మండలంలోని పలు రోడ్ల మలుపుల వద్ద సూచిక బోర్డులు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. 9లో▸

బోనమెత్తిన బంట్వారం

బంట్వారంలో గ్రామ దేవతల జాతర నేత్రపర్వంగా సాగుతోంది. మూడురోజులుగా ప్రత్యేక పూజలు జరుగుతున్నాయి. శనివారం మహిళలు బోనాలతో ఊరేగింపు నిర్వహించి ఆలయానికి చేరుకున్నారు. నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. వేడుకల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని గ్రామ దేవతలను దర్శించుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని దేవతలను వేడుకున్నారు.

– బంట్వారం



బోనాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

నెలాఖరులోగా ఈకేవైసీ పూర్తి చేయాలి

అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్

వికారాబాద్ అర్బన్: ఈ నెల చివరి నాటికి వంద శాతం ఈకేవైసీ పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జిల్లాలోని రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేషన్ డీలర్లు బియ్యాన్ని పక్కదారి పట్టిస్తే వారి డీలర్‌షిప్ రద్దు తోపాటు, క్రిమినల్ కేసులు నమోదు చేస్తా మని హెచ్చరించారు. జిల్లాలో బినామి డీలర్లు ఉంటే వెంటనే విచారణ జరిపి చర్యలు తీసు కోవాలన్నారు. తెల్లరేషన్ కార్డుదారులు బియ్యం తీసుకొని ఇతరులకు అమ్మినా చర్యలు తప్పవన్నారు. లబ్ధిదారులు రేషన్ బియ్యం సొంతంగా వాడుకోవాలన్నారు. రేషన్ బియ్యం కొనే వారి వివరాలు తెలియజేయాలన్నారు. జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రాజేశ్వర్, జిల్లామేనేజర్ కొండల్‌రావు, రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు జూకారెడ్డి పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

అద్వానీకి భారతరత్న హర్షణీయం



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నేతలు

కుల్కచర్ల: బీజేపీ సీనియర్ నేత ఎల్‌కే అద్వానీకి భారతరత్న ప్రకటించడం హర్షణీయమని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కరణం ప్రహ్లాదరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఘణపురం వెంకటయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హిందూ ధర్మపరిరక్షణ కోసం అలుపెరుగని పోరాటం చేయడంతోపాటు పార్టీని గల్లీ నుంచి ఢిల్లీ వరకు నిర్మించిన గొప్ప వ్యక్తి అద్వానీ అని కొనియాడారు. అయోధ్యలో రామ మందిర నిర్మాణం జరగాలని కోరుకున్న వ్యక్తుల్లో ప్రముఖు లు ఆయనేనని పేర్కొన్నారు. అలాంటి వ్యక్తికి భారతరత్న ప్రకటించడం సంతోషకరమైన విషయమన్నారు.కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మైపాల్, బీజేవైఎం మండల అధ్యక్షుడు జీ మైపాల్, ఆర్‌ఎస్‌ఎస్ ప్రాంత ప్రముఖ్ రాజేశ్వర్, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు భీమయ్య, నాయకులు రామకృష్ణ, సంతోష్ గౌడ్, వెంకట్రాములు, మల్లేశం, రాంచంద్రయ్య, గోపాల్, లక్ష్మయ్య, భీరయ్య, మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

కొడంగల్ రూరల్: ఉపాధి హామీ పథకాన్ని కూలీలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా రీసోర్స్ పర్సన్ కొత్త సింహాద్రి సూచించారు. శనివారం మండలంలోని కస్తూర్‌పల్లిలో ఉపాధి హామీ పథకం పనులపై కూలీలకు అవగాహన కల్పించారు. వ్యవసాయ పనులకు కూడా ఈ పథకాన్ని వినియోగించుకోవచ్చని తెలిపారు. వాల్ పోస్టర్లు, చిత్రాలతో కూలీల హక్కులపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు గోవిందమ్మ, వెంకటప్ప, లక్ష్మణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించాలి

తాండూరు జూనియర్ సివిల్ జడ్జి శివలీల



వైద్యులతో మాట్లాడుతున్న జడ్జి శివలీల

తాండూరు టౌన్: క్యాన్సర్ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించాలని తాండూరు జూనియర్ సివిల్ జడ్జి శివలీల అన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల న్యాయాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ.. నేటి ఆధునిక ప్రపంచంలో క్యాన్సర్ మహమ్మారి ప్రజల జీవితాలను అతలాకుతలం చేస్తోందన్నారు. పర్యావరణ పరిస్థితులు, ఆహారపు అలవాట్ల వల్ల క్యాన్సర్ విస్తరిస్తోందన్నారు. క్యాన్సర్ సోకే విధానం, తగు జాగ్రత్తలపై ప్రజలకు వైద్యులు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేవీఎస్ మూర్తి మాట్లాడుతూ.. క్యాన్సర్‌ను ప్రథమ దశలో గుర్తిస్తే చికిత్సతో నయం చేయవచ్చన్నారు. అనంతరం జడ్జి ప్రభుత్వాస్పత్రిని పరిశీలించారు. పలువురు రోగులతో మాట్లాడి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. పేద ప్రజలకు సరైన వైద్యం అందేలా చూడాలని వైద్యులను ఆదేశించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి పీ రవికుమార్, ఉపాధ్యక్షుడు నర్సప్ప, కార్యదర్శి రజిత, సీనియర్ న్యాయవాదులు శివకుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కట్ట మైసమ్మ జాతర

తాండూరు టౌన్: పట్టణంలోని గుమస్తా నగర్‌లో కొలువుదీరిన కట్ట మైసమ్మ బోనాల జాతర ఆదివారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటలకు అమ్మవారికి అభిషేకం, 9.30 గంటలకు పల్లకీ సేవ, సాయంత్రం 5 గంటలకు బోనాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సోమవారం ఉదయం 10.30 గంటలకు శ్రీ లలితా సహస్రనామ పారాయణం, మధ్యాహ్నం 12 గంటలకు మహా మంగళ హారతి, అనంతరం అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకోవాలని సూచించారు.

వడివడిగా అడుగులు

శరవేగంగా కొడంగల్ అభివృద్ధికి చర్యలు

- మైనార్టీ గురుకులానికి అదనపు నిధులు
- రూ. 20 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం
- త్వరలో నూతన భవనాల నిర్మాణం
- కొడంగల్‌కు మెడికల్ కళాశాల
- మారుతున్న నియోజకవర్గ రూపురేఖలు



కొడంగల్ ముఖ చిత్రం

కొడంగల్: కొడంగల్ నియోజకవర్గానికి మహర్దశ పట్టింది. సీఎం రేవంత్‌రెడ్డి ఇక్కడి నుంచే ప్రాతినిధ్యం వహిస్తుండటంతో ఈ ప్రాంత అభివృద్ధికి చకచకా నిధులు విడుదలవుతున్నాయి. దీంతో రూపురేఖలు మారుతున్నాయి. కొడంగల్ నియోజకవర్గంలో మైనార్టీ బాలుర గురుకుల పాఠశాల నూతన భవనానికి ప్రభుత్వం అదనంగా రూ.20 కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు శనివారం మైనార్టీ సంక్షేమ శాఖ పరిపాలనా అనుమతులు ఇచ్చింది. ఆ శాఖ కార్యదర్శి ఉమర్ జలీల్ జీఓ నంబర్ 6తో ఆదేశాలు జారీ చేశారు. గతంలో ఇదే పాఠశాలకు అధునాతన సౌకర్యాలతో నూతన భవనాలు నిర్మించడానికి ప్రభుత్వం రూ.25 కోట్లు మంజూరు చేసింది. దీనికి అదనంగా మరో రూ.20 కోట్లను మంజూరు చేస్తూ ఆదేశాలు ఇచ్చారు. ప్రస్తుతం బొంరాస్‌పేట మండలం చిల్‌ముల్ మైలారం గ్రామంలో అద్దె భవనంలో పాఠశాల నడుస్తోంది. పీఎంజీవీకే మోడల్ నాణ్యతా ప్రమాణాలతో విద్యను అందించాలనే లక్ష్యంతో మున్సిపల్ పరిధిలోని సర్వే నంబర్ 496లో 4 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం కేటాయించింది. కొడంగల్ రేవంత్ నియోజకవర్గం కాబట్టి త్వరలో పక్కా భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఫిబ్రవరి మూడో వారంలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా శంకుస్థాపన చేసే అవకాశం ఉంది.

కొడంగల్‌కు మెడికల్ కళాశాల

రేవంత్‌రెడ్డి సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత కొడంగల్‌లో అభివృద్ధి పనులు వేగం పుంజుకున్నాయి. గతంలో అన్ని రంగాల్లోనూ వెనుకబడిన ఈ ప్రాంతం ఇప్పుడు విద్య, వైద్యం, రవాణా, ఉపాధి రంగాల్లో ముందుకెళుతోంది. ఇందులో భాగంగానే కొడంగల్ శివారులో మెడికల్ కళాశాల నిర్మాణానికి స్థల సేకరణ చేస్తున్నారు. రాష్ట్ర స్థాయి అధికారులు పలుమార్లు ఈ ప్రాంతంలో పర్యటించి ప్రభుత్వ భూములపై ఆరా తీస్తున్నారు. త్వరలో కొడంగల్ ప్రజలకు వైద్య విద్యను అందుబాటులోకి తేనున్నారు. దీనికి తోడు ఆయూష్ కళాశాల కూడా మంజూరు చేసే అవకాశం ఉంది. కొడంగల్ నియోజకవర్గానికి చెందిన వందలాది మంది విద్యార్థులు కర్ణాటక రాష్ట్రానికి వెళ్లి బీఏఎంఎస్, బీహెచ్ఎంఎస్ వైద్య విద్యను అభ్యసిస్తున్నారు. ఈ ప్రాంతలో ఆయూష్ కళాశాలను ఏర్పాటు చేస్తే ఇక్కడి విద్యార్థులకు మేలు జరుగుతుందని విద్యావంతులు భావిస్తున్నారు. కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. కొడంగల్ దవాఖానాను 100 పడకలుగా మారుస్తున్నారు. బీమా ఎత్తిపోతల ద్వారా కొడంగల్ నియోజకవర్గానికి సాగునీరు పారించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తారు. కొడంగల్‌ను రెవెన్యూ డివిజన్‌గా మారుస్తారు. వ్యవసాయ డిప్లమో కళాశాల, ఉద్యానవన పరిశోధనా కేంద్రం కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు.

అభివృద్ధి పథంలో మున్సిపల్

కొడంగల్ మున్సిపల్‌ను రూ.292 కోట్లతో అభివృద్ధి చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. మురుగు కాల్వల నిర్మాణం,తాగునీటి సరఫరా, సీవరేజ్ సిస్టం ఏర్పాటు, అంబేడ్కర్ చౌరస్త విస్తరణ, మున్సిపల్ కార్యాలయానికి నూతన భవనం, క్రీడా ప్రాంగణం, ఇండోర్ స్టేడియం, స్పోర్ట్స్ కోచింగ్ సెంటర్, బండల ఎల్లమ్మ ఆలయం,వెంకటేశ్వర స్వామి ఆలయా ల అభివృద్ధి, సెంట్రల్ లైటింగ్ సిస్టం తదితర పనులకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి అందజేశారు.

రేవంత్ పర్యటన వాయిదా

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం కొడంగల్‌లో పర్యటించాల్సి ఉంది. ముఖ్యమంత్రి హోదాలో మొదటి సారి కొడంగల్‌కు వస్తున్న నేపథ్యంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయాలని రేవంత్ నిర్ణయించారు. ఇందులో భాగంగా పూర్తి స్థాయిలో స్థల సేకరణ జరగలేదు. ప్రభుత్వ భూముల కోసం అధికారులు సర్వే చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కాస్తా జాప్యం జరగడంతో రేవంత్ పర్యటన వాయిదా పడింది. ఫిబ్రవరి మూడో వారంలో రేవంత్ కొడంగల్‌లో పర్యటించే అవకాశం ఉంది. అప్పటి వరకు పూర్తి స్థాయిలో అభివృద్ధి పనులకు ప్రణాళికలు సిద్ధం చేయాలని రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులను సీఎం ఆదేశించినట్లు తెలుస్తోంది.

పది సార్లు జైలుకెళ్లినా బుద్ధి మారలే

- జల్సాలకు అలవాటు పడి బైక్‌ల చోరీ
- 3నెలల్లో 12వాహనాల అపహరణ
- పోలీసులకు చిక్కిన అంతర్ జిల్లా దొంగ
- అరెస్టు, రిమాండ్‌కు తరలింపు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ కోటిరెడ్డి

అనంతగిరి: పది సార్లు జైలుకెళ్లి వచ్చినా బుద్ధి మాత్రం మారలేదు. యథావిధిగా బైక్‌ల చోరీకి పాల్పడుతూ పోలీసులకు పట్టుబడ్డాడు. 3 నెలల్లో 12 బైకులు ఎత్తుకెళ్లిన నిందితుడ్ని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. శనివారం ఎస్పీ కోటిరెడ్డి వికారాబాద్ సీసీఎస్ పీఎస్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి కేసు వివరాలు వెల్లడించారు. బంట్వారం మండలం తొర్మామిడి గ్రామానికి చెందిన గుడాల మాణిక్యం జల్సాలకు అలవాటు పడి చోరీ బాట పట్టాడు. 2018 నుంచి బైక్‌లను దొంగిలించడం మొదలు పెట్టాడు. శనివారం ఉదయం 5 గంటల ప్రాంతంలో పోలీసులు వికారాబాద్ రైల్వే స్టేషన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో హోండా బైక్‌పై వస్తున్న మాణిక్యంను ఆపారు. సీసీఎస్ సీఐ బల్వంతయ్య, టౌన్ సీఐ సత్యనారాయణరాజు, సిబ్బంది వాహన పత్రాలు చూపించాలని అడిగారు. అతని నుంచి సరైన సమాధానం రాకపోవడంతో అదుపులో తీసుకొని విచారించగా అసలు విషయం బయటపడింది. ఆర్‌సీపురం పరిధిలో బైక్ దొంగిలించి తీసుకొస్తున్నట్లు ఒప్పుకున్నాడు. నిందితుడి తల్లి పైన 2009లో బంట్వారం పీఎస్‌లో దొంగతనం కేసు నమోదైంది. జల్సాలకు అలవాటుపడిన మాణిక్యం హాస్టళ్లు, రైల్వే, బస్ స్టేషన్ల వద్ద పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలే లక్ష్యంగా చోరీకి పాల్పడుతున్నాడు. గతంలో బైక్ మెకానిక్‌గా పనిచేసిన అనుభవం ఉండడంతో హ్యాండిల్ లాక్ విరగొట్టి దొంగతనాలకు పాల్పడ్డాడు. మొయినాబాద్, మియాపూర్, శంకర్‌పల్లి, మాదాపూర్, నార్సింగి, గోల్కొండ, కేపీహెచ్‌బీ, పటాన్‌చెరు, కొండాపూర్, సదాశివపేట, సిద్దిపేట, జీఆర్‌పీ, ఖమ్మం పీఎస్‌ల పరిధిలో 13 కేసులు నమోదయ్యాయి. పది సార్లు జైలుకు వెళ్లి వచ్చాడు. 10 బైకుల దొంగతనం కేసులు, 3 మొబైల్ దొంగతనం కేసులు ఉన్నాయి. ఫేక్ ఆర్‌సీలు తయారు చేసి విక్రయిద్దామనే ఉద్దేశంతో దొంగలించిన బైకులను తన పొలం వద్ద దాచిపెట్టాడు. పోలీసులు 11 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. బైకుల విలువ రూ.17.30లక్షలు వరకు ఉంటుందని ఎస్పీ తెలిపారు. ఖరీదైన బైక్‌లే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్నట్లు ఆయన తెలిపారు. కేసును ఛేదించిన సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ బల్వంతయ్య, బాలస్వామి, సిబ్బంది చెన్నయ్యగౌడ్, గోవింద్, అంజయ్య, కృష్ణారెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, అంజప్ప, సత్తయ్యగౌడ్, రామకృష్ణకు రివార్డులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించనున్నట్లు ఎస్పీ తెలిపారు.



నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ కోటిరెడ్డి, స్వాధీనం చేసుకున్న బైక్‌లు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న జిల్లా జడ్జి సుదర్శన్

శాస్త్రవేత్తలుగా ఎదగాలి

- జిల్లా జడ్జి సుదర్శన్

అనంతగిరి: విద్యార్థులు సైన్స్‌పై అవగాహన పెంచుకొని శాస్త్రవేత్తలుగా ఎదగాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సుదర్శన్ సూచించారు. శనివారం వికారాబాద్‌లోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముఖి సైన్స్ సంబరాలు (జిల్లా స్థాయి ప్రతిభ పరీక్ష) నిర్వహించారు. ముగింపు కార్యక్రమానికి జడ్జి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నేటి బాలులే రేపటి పౌరులన్నారు. శాస్త్రీయ ఆలోచనలను పెంపొందించుకొని పరిపూర్ణ మానవులుగా ఎదగాలన్నారు. రాజ్యాంగంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ పోటీల్లో జిల్లాలోని 13 పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలుగా ప్రభుత్వ పాఠశాల ఇంగ్లిష్ మీడియం విభాగంలో ఎంజేపీటీ బీసీడబ్లుర్ కొడంగల్, ప్రభుత్వ పాఠశాల తెలుగు మీడియం విభాగంలో శ్రీ బాలాజీ కేజీహెచ్ఎస్ కొడంగల్, ప్రైవేట్ పాఠశాలల విభాగంలో పరిగి కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు విజేతలుగా నిలిచారని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి వెంకటరమణ తెలిపారు. ఎంపికైన టీంలు ఈ నెల 9, 10, 11 తేదీల్లో జనగామలో జరిగే రాష్ట్ర స్థాయి చెకుముఖి సైన్స్ సంబరాల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రతినిధులు రత్నం, అబ్దుల్, శ్రీనివాసులు, పుష్పలత, నవీన్‌కుమార్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, ఆయా పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ దైవచింతన ఉండాలి

- స్పీకర్ ప్రసాద్‌కుమార్

అనంతగిరి: ప్రతి ఒక్కరికీ దైవ చింతన ఉండాలని అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్ అన్నారు. వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని వెంకటాపూర్ తండాలో కొలువైన శ్రీ శ్రీ శ్రీ జగదాంబ భవాని, జగద్గురు సేవాలాల్ మహరాజ్ ఆలయ 17వ వార్షిక మహోత్సవం మూడు రోజులుగా ఘనంగా సాగుతున్నాయి. తెల్లవారుజామున అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం పూజల్లో స్పీకర్ పాల్గొన్నారు. తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, ఆలయ ఫౌండర్ ట్రస్టీ కిషన్ నాయక్, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సుధాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మైపాల్‌రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ రమేష్‌కుమార్, కౌన్సిలర్లు చందర్‌నాయక్, మురళీ, వేణు పాల్గొన్నారు.



అమ్మవారి సేవలో స్పీకర్ ప్రసాద్‌కుమార్

జిల్లా స్థాయిలో మెరిసిన విద్యార్థి



షీల్డ్ అందుకుంటున్న వైష్ణవి

కేశంపేట: సాంఘిక శాస్త్రం టాలెంట్ టెస్టులో కొత్తపేట జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థిని మొదటిస్థానంలో నిలిచింది. పాఠశాల హెచ్‌ఎం చంద్రశేఖర్ మాట్లాడుతూ.. శనివారం హయత్‌నగర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో సాంఘిక శాస్త్రం జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహించారని చెప్పారు. జిల్లా పరిధిలోని అన్ని పాఠశాలల విద్యార్థులు హాజరవ్వగా కొత్తపేట జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన వైష్ణవి ఇంగ్లిష్ విభాగంలో మొదటి స్థానంలో నిలిచిందన్నారు. ఈ సదర్భంగా విద్యార్థినికి ప్రశంసాపత్రం, షీల్డ్, నగదు బహుమతితో సత్కరించారని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థిని ఎంఈఓ మనోహర్, పీఆర్టీయూ మండల శాఖ అధ్యక్షుడు శ్రీనివాససాగర్, ఉపాధ్యాయులు అభినందించారు.

'నేవీ రాడార్'ను మరో చోటుకు మార్చండి

చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి


సాక్షి, రంగారెడ్డిజిల్లా: చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం పరిధి పరిగి అసెంబ్లీ నియోజకవర్గంలోని పూడూరు మండలం దామగుండంలో నేవీ రాడార్ స్టేషన్ నిర్మాణాన్ని మరో చోటికి మార్చాలని బీఆర్‌ఎస్ ఎంపీ డాక్టర్ జి.రంజిత్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ అంశంపై కేంద్ర రక్షణ శాఖ పునరాలోచన చేయాలని విజ్ఞప్తి చేశారు. దామగుండంలో రాడార్ స్టేషన్ నిర్మించడం వల్ల 400 సంవత్సరాల పురాతనమైన రామలింగేశ్వర స్వామి దేవాలయం, విలువైన అటవీ, ఔషధ వృక్షాలు కాలగర్భంలో కలిసే ప్రమాదం ఉందన్నారు. దీనికి తోడు ఈ రాడార్ స్టేషన్ ఏర్పాటు అనంతరం ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉందని స్థానిక ప్రజల్లో అనుమానాలు, ఆందోళనలు పెరిగాయని స్పష్టం చేశారు. పూడురు మండల ప్రజానీకం నుంచి తీవ్ర అభ్యంతరాలు వస్తున్నాయని ఆయన వెల్లడించారు. పార్లమెంటరీ రూల్ 377 కింద లోక్‌సభలో ప్రత్యేకంగా రంజిత్‌రెడ్డి ఈ ప్రశ్న లేవనెత్తారు. స్థానిక ప్రజలు ఆందోళనలను పరిశీలించిం కేంద్ర రక్షణ శాఖ తన నిర్ణయాన్ని మార్చుకోవాలని సూచన చేశారు. నేవీ రాడార్ స్టేషన్‌ను అక్కడి నుంచి మార్చి వేరే అనువైన ప్రదేశానికి మార్చాలని కోరారు. ఈ విషయంపై స్థానిక ప్రజలు గత కొద్ది రోజులుగా ఆందో ళన చేస్తున్న విషయం తెలిసిందే.



పార్లమెంట్ సమావేశాల్లో మాట్లాడుతున్న రంజిత్‌రెడ్డి

క్లుప్తంగా

విద్యార్థి దశ చాలా విలువైనది
స్పీకర్ ప్రసాద్‌కుమార్



మాట్లాడుతున్న ప్రసాద్‌కుమార్

అనంతగిరి: విద్యార్థి దశ ఎంతో విలువైనదని అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్ అన్నారు. శనివారం వికారాబాద్‌లో సెయింట్ జూడ్ ఉన్నత పాఠశాల 60వ వార్షికోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల్లోని నైపుణ్యాలను వెలికితీసే బాధ్యత ఉపాధ్యాయులదేనని చెప్పారు. అందుకు తల్లిదండ్రుల సహకారం కూడా అవసరమని పేర్కొన్నారు. విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని సూచించారు. ఇప్పటి నుంచే ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని వాటిని సాధించేవరకు విశ్రమించకూడదన్నారు. ఉన్నతస్థానాలకు ఎదిగి తల్లిదండ్రులకు పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల, యూత్ కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి సంతోష్‌కుమార్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, వార్డు కౌన్సిలర్ శ్రీదేవి సదానందరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ రాంచంద్రారెడ్డి, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ రమేష్‌కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, పట్టణ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

సర్కారు మారినా.. బొమ్మ మారలే !



కుల్కచర్ల: రాష్ట్రంలో ప్రభుత్వం మారినా.. మాజీ సీఎం కేసీఆర్ స్టిక్కర్ ఉన్న కిట్లను లబ్ధిదారులకు అందజేస్తున్నారు. శనివారం కుల్కచర్ల ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవం చేసుకున్న మహిళలకు అక్కడి వైద్యాధికారులు మాజీ సీఎం స్టిక్కర్ ఉన్న కేసీఆర్ కిట్లను అందజేశారు.

ప్రజల సహకారంతో గ్రామాభివృద్ధి

మొయినాబాద్ రూరల్: హిమాయత్‌నగర్ గ్రామ అభివృద్ధి అందరి సహకారంతోనే సాధ్యమైందని సర్పంచుల సంఘం మాజీ ఉపాధ్యక్షురాలు, హిమాయత్‌నగర్ మాజీ సర్పంచ్ మంజుల పేర్కొన్నారు. మండల పరిధిలోని హిమాయత్‌నగర్ గ్రామంలో పలు యువజన సంఘాల ఆధ్వర్యంలో సన్మానించారు.

సర్వం కల్తీమయం..

కాదేదీ కల్తీకి అనర్హం అన్నట్లుగా.. అంగట్లో దొరికే సరకులన్నీ.. కల్తీమయం అయ్యాయి. ఫలితంగా సగటు మనిషి ఆరోగ్యం గుల్ల అవుతోంది. ఉరుకుల పరుగుల జీవితంలో ఆరోగ్యంపై ఎంత శ్రద్ధ చూపుతున్నా.. ప్రజారోగ్యం పట్టని కేటుగాళ్ల ధనదాహానికి బలైపోతున్నారు. ఆహారపు అలవాట్లను ఎంత కట్టడి చేసినా.. వారికి తెలియకుండానే కల్తీ ఊబిలో చిక్కుకొని, ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

ప్రజారోగ్యం పట్టని వ్యాపారులు
- జోరుగా కల్తీ ఆహార పదార్థాల అమ్మకం
- నాసికరం సరకులతో మాయ చేస్తున్న వైనం
- కొరవడిన అధికారులు సోదాలు
- ఆందోళనలో ప్రజలు, వినియోగదారులు

పరిగి: పరిగి కేంద్రంగా నాసిరకం ఆహార పదార్థాల క్రయవిక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ధనార్జనే ధ్యేయంగా కొందరు వ్యాపారులు.. కల్తీ సరుకులు అమ్ముతూ.. ప్రజల ప్రాణలతో చెలగాటం ఆడుతున్నారు. పసిపిల్లలు తాగే పాల నుంచి.. మాంసం, పప్పు, ఉప్పు, నూనే, అల్లం పేస్ట్, బియ్యం, కారం, పసుపు, పిండి, బిస్కట్, చాక్లెట్, టీపోడి ఇలా ప్రతీది.. కల్తీ చేస్తూ.. ప్రజారోగ్యాన్ని గాలిలో దీపంలా మార్చేస్తున్నారు. ఏది అసలో.. ఏది నకిలో పోల్చుకోలేనంతగా తయారు చేస్తున్నారు. స్థానికంగా నాణ్యత లోపించిన సరకుల క్రయవిక్రయాల జోరు కొనసాగుతున్నప్పటికీ.. సంబంధిత అధికారులు పట్టించుకోవటం లేదని, నామ మాత్రపు తనిఖీలతో సరిపెడుతుండటంతో కేటుగాళ్లు మరింత రెచ్చిపోతున్నట్లు సమాచారం. గడువు తీరిన సీతల పానియాలు, పశువుల ఎముకలతో తయారు చేసిన వంట నూనెను సైతం పచారీ కొట్లలో అమ్ముతున్నట్లు తెలుస్తోంది. తినే వస్తువులే కాకుండా.. మనిషి అనారోగ్యం పాలైతే వైద్యుడి సూచనల మేరకు వేసుకునే ఔషధాలు కూడా.. నాసిరకం లేదా.. గడువు ముగిసినవి విక్రయిస్తుండటం కలవర పెడుతోంది. ఇటీవల పలు ప్రాంతాల్లో కాలం తీరిన మందుబిళ్లలు వేసుకొని ఒకరిద్దరు ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు వెలుగు చూసిన విషయం తెలిసిందే. దీంతో అసలు ఏం తినాలో, ఏం తినొద్దో తెలియక ప్రజలు అయోమయానికి గురవుతున్నారు.

జోరుగా.. జీరో దందా

కల్తీ పదార్థాల తయారీ, నిషేధిత వస్తువుల అమ్మకాల వంటిపై పోలీసులు నిఘా ఉంచినా.. కేటుగాళ్లు రూటుమార్చి కల్తీ వ్యాపారం జోరు పెంచుతున్నారు. పోలీసుల కళ్లు కప్పి క్రయవిక్రయాలు జరుపుతూనే ఉన్నారు. గతేడాది పోలీసులు.. పరిగి పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక సోదాలు నిర్వహించగా.. అధికారులు నివ్వెర పోయేలా ఎన్నో అక్రమ దందాలు వెలుగు చూశాయి. అయినప్పటికీ.. నిఘా పటిష్టతను పెంచకపోవడంతో కల్తీ వ్యాపారం మూడుపువ్వులు, ఆరుకాయలుగా విస్తరించిందన్న ఆరపణలు వస్తున్నాయి. జిల్లాలో ఎక్కడా లేని విధంగా పరిగిలో జీరో దందా పరుగు పెడుతున్నట్లు తెలుస్తోంది.



పోలీసుల దాడుల్లో పట్టుబడిన కల్తీ టీ పొడి(ఫైల్)

విత్తనాలు సైతం..

నాలుగు రోజుల క్రితం పరిగి పట్టణ కేంద్రంలో కల్తీ మాంసం విక్రయిస్తున్నారన్న సమాచారంతో పోలీసులు మాంసం దుకాణాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. కల్తీ మటన్ అమ్ముతున్న సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. గతేడాది కల్తీ టీ పొడిని విక్రయిస్తున్నట్లు తెలుసుకున్న పోలీసులు.. దాడులు చేసి, అధిక మొత్తంలో టీ పొడిని స్వాధీనం చేసుకున్నారు. అలాగే కల్తీ విత్తనాలు పట్టుబడటంతో పరిగిలో ఎంత మేర కల్తీ పదార్థాల విక్రయ జోరు ఉందో అర్థం చేసుకోవచ్చు. దీంతో కల్తీ సరకుల అమ్మకాలకు కేంద్రంగా పరిగికి ముద్ర పడిందని పలువురు వాపోతున్నారు. గతంలో వైన్స్‌లోనే కల్తీ మందును విక్రయించడాన్ని.. పోలీసులు గుట్టురట్టు చేశారు. గుట్కా, రేషన్ బియ్యం, ఇసుక అక్రమ వ్యాపారాలు సైతం జోరుగా ఉన్నా.. సంబంధిత అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. నకిలీ సరుకుల క్రయవిక్రయాలు, అక్రమ వ్యాపారం చేసే వారిపై పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచి, ఉక్కుపాదం మోపాలని పట్టణ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.



పట్టుబడిన నిల్వ ఉంచిన మాంసం (ఫైల్)

నిర్మూలనకు ప్రత్యేక నిఘా



కల్తీ సరకుల క్రయవిక్రయాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటాం. నకిలీ, అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. కల్తీ ఆహార పదార్థాలను ఎవరైనా విక్రయించినట్లు తెలిస్తే.. పోలీసులకు సమాచారం ఇవ్వండి. అన్ని రకాల వ్యాపారాలపై నిఘా పెంచాం. కేటుగాళ్ల గుట్టురట్టు చేసేందుకు స్పెషల్ ఫోకస్ చేశాం.

– సత్యనారాయణ, ఎస్ఐ, పరిగి

బైక్‌పైకి దూసుకెళ్లిన డీసీఎం
- యువకుడి మృతి
- స్టీరింగ్ ఫెయిల్ కావడంతో ఘటన



మృతుడు అమరేందర్‌రెడ్డి

బొంరాస్‌పేట: ద్విచక్ర వాహనంపైకి డీసీఎం దూసుకెళ్లిన ఘటనలో ఓ యువకుడు మృత్యువాత పడ్డాడు. ఈ సంఘటన మండల పరిధి రేగడిమైలారం శివారు జాతీయ రహదారి163పై శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉదయం 10.30 గంటల సమయంలో మెహదీపట్నం నుంచి కొడంగల్ వెళ్తున్న డీసీఎం వాహనం స్టీరింగ్ ఫెయిల్ అయింది. దీంతో నియంత్రణ కోల్పోయిన డ్రైవర్ ఎండీ అజర్.. ఎదురుగా వస్తున్న కర్నాటక రాష్ట్రం గుర్మిట్‌కల్ తాలూకా ముస్లాయిపల్లికి చెందిన అమరేందర్‌రెడ్డి(21) ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో అమరేందర్‌రెడ్డి మృతిచెందాడు. అంతటితో డీసీఎం ఆగకుండా.. పొలాల్లోకి దూసుకెళ్లి.. విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొంది. దీంతో వాహనంలో ముందు భాగంలో కూర్చున్న ప్యాసింజర్ సంగీత తీవ్రంగా గాయపడింది. ఆమె పరిస్థితి విషమంగా ఉంది. సమాచారం అందుకు ఎస్ఐ ఎండీ రవూఫ్ ప్రమాద స్థలికి చేరుకొని పరిశీలించారు. చికిత్స కోసం సంగీతను ఆసుపత్రికి తరలించారు. మృతుడి అన్న నరేందర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, పోస్టుమార్టం నిమిత్తం శవాన్ని పరిగి ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఇదిలా ఉండడా.. చుట్టపక్కల గ్రామాలను విద్యుత్ సరఫరాను అందించే మెయిన్ కరెంట్ స్తంభాన్ని డీసీఎం ఢీకొట్టడంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగినట్లు స్థానికులు తెలిపారు.

సంతలో సెల్‌ఫోన్ల చోరీ



వినియోగదారులతో కిక్కిరిసిపోయిన కూరగాయల సంత

- సీసీ కెమెరాలు లేక.. దొంగల హల్‌చల్
- ఫిర్యాదు చేసినా స్పందించని పోలీసులు

ధారూరు: వారాంతపు సంత అంటే.. సహజంగానే వ్యాపారులు, వినియోగదారులతో కిక్కిరిసిపోయి ఉంటుంది. దీనికి తోడు మార్కెట్ పరిసర ప్రాంతంలో సీసీ కెమెరాలు లేవు. దీనినే ఆసరా చేసుకున్న కొందరు వ్యక్తులు సెల్‌ఫోన్ల చోరీకి తెగబడుతున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. ధారూరు మండల కేంద్రంలో ప్రతి శనివారం జరిగే కూరగాయల మార్కెట్లో మొబైల్స్ దొంగలు పెరిగిపోయారు. మహిళలు కూరగాయలు కొనుగోలు చేస్తున్న సమయంలో.. దుండగులు చాకచక్యంగా వ్యవహరించి ఫోన్లను అపహరిస్తున్నారు. ఇదే విషయమై గతంలో పోలీసులకు ఫిర్యాదు చేసినా.. ఎటువంటి చర్యలు తీసుకోలేదని, కనీసం సీసీ కెమెరాలు అయినా ఏర్పాటు చేయడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇదే అదనుగా భావిస్తున్న దొంగలు పేట్రేగి పోతున్నారని వాపోయారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు గతంలో దాతలు ఇచ్చిన డబ్బులు దుర్వినియోగం అయ్యాయనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం సీసీల ఏర్పాటుకు పోలీసులు దాతల నుంచి సహాయం కోరుతున్నా.. ఎవరూ ముందుకు రావటం లేదని తెలుస్తోంది. ఇప్పటికైనా పోలీసులు స్పందించి చోరీల నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని వ్యాపారులు, వినియోగదారులు కోరుతున్నారు.

వేధింపులు తాళలేక..
ఉరేసుకుని వివాహిత దుర్మరణం



మౌనిక (ఫైల్)

అనంతగిరి: అత్తింటి వారి వేధింపులు తాళలేక ఓ మహిళ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. వివరాలిలా ఉన్నాయి.. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరుకు చెందిన మౌనిక(28)కు వికారాబాద్ మండలం నారాయణపూర్ చింతలబోగుడకు చెందిన శ్రీనివాస్‌తో 14 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొంత కాలంగా భార్యాభర్తల మధ్య అభిప్రాయబేధాలు నెలకొన్నాయి. దీంతో ఆరుసార్లు గ్రామ పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టి సముదాయించారు. అయినా పరిస్థితిలో మార్పు రాలేదు. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి మౌనిక అత్తవారింట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తన కూతురును భర్త శ్రీనివాస్, అత్త, మరిది, ఆడపడుచులు కలిసి తాడుతో గొంతుకు బిగించి హత్య చేశారని మృతురాలి తల్లి పొద్దుటూరు లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని, అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీను తెలిపారు.

పార్లమెంట్ ఎన్నికలకు శిక్షణ

ఇబ్రహీంపట్నం రూరల్: పార్లమెంట్ ఎన్నికల్లో ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా విధులు నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి సంగీత అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నియోజకవర్గ, జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ మాట్లాడారు. ఎన్నికలు సవ్యంగా జరిగేలా ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఈవీఎంలు, వీవీప్యాట్లు, కంట్రోల్ యూనిట్లపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకొని, ఎన్నికల ప్రవర్తన నియమావళిని అనుసరించి ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని వెల్లడించారు.

రెండు ఇళ్లల్లో చోరీ
బంగారు ఆభరణాల అపహరణ

ఆమనగల్లు: ఉదయ్‌నగర్ కాలనీలో శుక్రవారం రాత్రి రెండు ఇళ్లలో చోరి జరిగింది. ఈ ఘటనలో దుండగులు బంగారు, వెండి ఆభరణాల అపహరించారు. ఆమనగల్లు ఎస్ఐ బాల్‌రాం కథనం ప్రకారం.. పట్టణంలోని ఉదయనగర్ కాలనీకి చెందిన పాతకోట కిష్టమ్మ అనే వృద్ధురాలు ఒంటరిగా ఉంటోంది. పక్కనే ఉన్న కుమారుడు సాయిలు ఇంట్లో ప్రతిరోజూ రాత్రి నిద్రిస్తూ.. ఉదయం వస్తుంటుంది. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి కుమారుడి ఇంట్లో నిద్రించి ఉదయం ఇంటికి రాగా.. ఇంటి తాళం పగులకొట్టి ఉండటాన్ని గమనించింది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న వెండి గొలుసులు, తులం బంగారు ఆభరణాలు, నగదు చోరీ అయినట్లు గుర్తించారు. ఇదే కాలనీకి చెందిన తోకల అరుణ తన కుటుంబ సభ్యులతో ఇంట్లో నిద్రిస్తుండగా.. రాత్రి 2 గంటల సమయంలో ఇంట్లోకి చొరబడిన దొంగ.. ఆమె మెడలో ఉన్న బంగారు పుస్తెలతాడును లాక్కొని వెళ్తుండగా.. దొంగా అని అరవడంతో దుండగుడు పారిపోయినట్లు బాధితురాలు తెలిపింది. వీటిపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. సంఘటనా స్థలాలను ఏసీపీ శంషాంక్‌రెడ్డి, ఆమనగల్లు సీఐ వెంకటేశ్వర్లు, కడ్తాల్ సీఐ శివప్రసాద్‌లు పరిశీలించి, బాధితుల నుంచి వివరాలు సేకరించారు. క్లూస్ టీంతో ఆధారాలు సేకరించారు.

'పది'ంతల ఫలితాలు రాబట్టాలి

జిల్లా విద్యాధికారి రేణుకాదేవి



ప్రధానోపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈఓ

పరిగి: ప్రత్యేక శ్రద్ధతో పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించే దిశగా ముందుకు సాగాలని జిల్లా విద్యాధికారి రేణుకాదేవి సూచించారు. శనివారం పట్టణ కేంద్రంలోని మండల పరిషత్ సమావేశపుహాల్లో నిర్వహించిన సమీక్షలో పరిగి, పూడూరు, దోమ, కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులను పది పరీక్షలకు విద్యార్థులను ఎలా సన్నద్ధం చేస్తున్నారు, ఎలా చేస్తే.. ఫలితాలు వస్తాయో ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడారు. ప్రతి విద్యార్థిని దృష్టిలో ఉంచుకుని, మంచి ఫలితాలు సాధించేలా కృషి చేయాలని సూచించారు. అదనపు తరగతులు నిర్వహించి, నిత్యం స్లిప్ టెస్టులను నిర్వహించడం ద్వారా వారి సామర్థ్యం తెలుస్తుందన్నారు. ఉదయం గంట, సాయంత్రం గంట ఎక్కువ సమయం తీసుకుని బోధనలు చేయాలన్నారు. వెనుక బడిన విద్యార్థులపై ప్రత్యే శ్రద్ధ చూపాలన్నారు. పిల్లలకు అర్థమయ్యే విధంగా పాఠ్యాంశాలను బోధించి, పరీక్షలకు సన్నద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి హరిశ్చందర్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అల్పాహారం అందజేతలో కాంట్రాక్టర్ కక్కుర్తి





సాంబారును పరిశీలిస్తున్న ఉపాధ్యాయుడు (ఇన్‌సెట్లో) వడ్డించిన సాంబారులో అన్నం మెతుకులు

ముందు రోజు మిగిలిన పొంగలి వడ్డన

తాండూరు టౌన్: అల్పాహారం అందజేతలో కాంట్రాక్టర్ కక్కుర్తి పడ్డాడు. ముందు రోజు (శుక్రవారం) మిగిలిన ఆహార పదార్థాలను వడ్డించాడు. దుర్వాసన రావడంతో విద్యార్థులు టిఫిన్ భుజించకుండా ఉపాధ్యాయులకు ఫిర్యాదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. తాండూరు పట్టణం ప్రభుత్వ నంబర్ వన్ పాఠశాలలో శనివారం అల్పాహారంగా విద్యార్థులకు ఇడ్లీ వడ్డించిన కాంట్రాక్టర్.. సాంబారు లేదా చట్నీ వేయాల్సి ఉంది. కానీ.. నిల్వ ఉన్న పొంగలి సాంబారును పోశాడు. సాంబారులో అన్నం మెతుకులు కనపడటం, దుర్వాసన రావడంతో విద్యార్థులు తినకుండా.. విషయం ఉపాధ్యాయులకు చేరవేశారు. దీంతో సదరు కాంట్రాక్టర్‌ను నిలదీశారు. అనంతరం ఓ ఉపాధ్యాయుడు బయటి నుంచి చట్నీ తెప్పించి విద్యార్థులకు వడ్డించడంతో టిఫిన్ చేశారు. పాడైపోయిన అల్పాహారాన్ని వడ్డించి, పిల్లల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న సదరు కాంట్రాక్టర్‌పై చర్య తీసుకోవాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. ఉన్నతాధికారులు అల్పాహార వితరణపై పర్యవేక్షణ కొనసాగించాలని కోరారు.

16న 'పట్నం' అవిశ్వాస సమావేశం

నోటీసులకు స్పందించిన కలెక్టర్



ఇబ్రహీంపట్నం మున్సిపల్ కార్యాలయం

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ కౌన్సిలర్లు ఇచ్చిన అవిశ్వాస నోటీసులకు కలెక్టర్ శశాంక స్పందించారు. ఈ నెల 16న ఉదయం 11 గంటలకు ప్రత్యేక సమావేశానికి ముహుర్తం ఖారారు చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు మున్సిపల్ అధికారులకు, కౌన్సిలర్లకు ఈ సమాచారాన్ని ఇచ్చారు. గత నెల 8న మున్సిపల్ పాలకవర్గంలో 24 మందికిగాను 17 మంది కౌన్సిలర్లు చైర్ పర్సన్ కప్పరి స్రవంతిపై అవిశ్వాసాన్ని ప్రకటిస్తూ కలెక్టర్‌కు నోటీసులిచ్చారు. ఈ 17 మందిలో ఇద్దరు బీజేపీ, ముగ్గురు కాంగ్రెస్ కౌన్సిలర్లు ఉన్నారు. 16 మంది సభ్యుల మద్దతుంటే అవిశ్వాసం నెగ్గే అవకాశం ఉంటుంది. బీఆర్ఎస్ అత్యధిక కౌన్సిలర్ల స్థానాలను కైవసం చేసుకోవడంతో అప్పటి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సూచన మేరకు కప్పరి స్రవంతి చైర్ పర్సన్ పీఠంపై కూర్చున్నారు. ఏడాదిన్నర కాలంగా మంచిరెడ్డి కిషన్‌రెడ్డితో ఏర్పడిన విభేదాలతో అసెంబ్లీ ఎన్నికల ముందు చైర్ పర్సన్ స్రవంతి బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. మరో ముగ్గురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు సైతం చైర్ పర్సన్ బాటలోనే నడిచారు. కాగా కాంగ్రెస్‌కు చెందిన ముగ్గురు కౌన్సిలర్లు కారెక్కారు. బీఆర్ఎస్ నుంచి సీతారాంపేట కౌన్సిలర్ కొంద్రు శ్రీలత చైర్‌పర్సన్ పదవిని ఆశిస్తున్నట్లు సమాచారం. నోటీసులు అందజేసిన వారిలో ఇద్దరు సభ్యులు చేజారినా ఈ అవిశ్వాస ప్రక్రియ వీగిపోయే ఆవకాశం ఉంటుంది.

'టీచర్ల నగరబాట'పై చర్చ

డిప్యూటేషన్ వివరాలు తెలునుకుంటున్న జిల్లా విద్యాధికారులు

సాక్షి ఎఫెక్ట్..

షాద్‌నగర్‌రూరల్: పల్లె పాఠశాలల్లో పాఠాలు బోధించాల్సిన ఉపాధ్యాయులు డిప్యూటేషన్ పేరుతో పట్టణ పాఠశాలలకు వెళ్లారు. ఇదే అంశంపై ఉపాధ్యాయుల డిప్యూటేషన్‌పై 'టీచర్ల నగరబాట' శీర్షికన 'సాక్షి'లో శనివారం ప్రచురించింది. దీనికి స్పందించిన విద్యాధికారులు.. డిప్యూటేషన్‌పై వెళ్లిన వారి జాబితాను సిద్ధం చేయాల్సింది ఎంఈఓలకు ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం. ఉన్నతాధికారుల జోక్యం చేసుకోవడంతో.. తదుపరి పరిణామలపై ఉపాధ్యాయ వర్గాల్లో చర్చ మొదలైంది.

వివరణ కోరిన విద్యాధికారులు

నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల నుంచి డిప్యూటేషన్‌పై వెళ్లిన ఉపాధ్యాయుల వివరాలను జిల్లా విద్యాధికారులు కోరినట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఆయా మండలాల విద్యాధికారులు జాబితాను సిద్ధం చేసి, అందజేసినట్లు సమాచారం. ఒక్క నియోజకవర్గంలోనే ఇంత మంది డిప్యూటేషన్‌పై వెళ్తే.. జిల్లా వ్యాప్తంగా ఎంత మంది ఉంటారనే చర్చ జరుగుతోంది. విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పదించి, డిప్యుటేషన్‌పై వెళ్లిన ఉపాధ్యాయులను, తిరిగి సొంత మండలాలకు పంపుతారా లేదా అనే విషయం వేచిచూడాల్సిందే.

డిప్యూటేషన్‌పై వెళ్లిన వారు వీరే..

ఆరు మండలాల పరిధిలో సుమారు 50మంది ఉపాధ్యాయులు డిప్యూటేషన్‌పై వెళ్లారు. ఫరూఖ్‌నగర్ మండలంలో నాగులపల్లి, శేరిగూడ, గంట్లవెళ్లి, ఎలికట్ట(ఇద్దరు), తోకరేగడితండా, నేరళ్లచెరువు (ముగ్గురు), జీడీవోడ్కతండా, లింగారెడ్డిగూడ, అయ్యవారిపల్లి, బూర్గుల(ఇద్దరు), చించోడ్, మంగలిగడ్డతండా(నలుగురు) కొందుర్గు మండలంలో అయోధ్యతండా, కొందుర్గు, ఉత్తరాస్‌పల్లి, చౌదరిగూడ మండలంలో చింతకుంటతండా, దామరగిద్దతండా, ఇంద్రానగర్, రావిర్యాల, కేశంపేట మండలంలో నానుతండా, బల్లరాళ్లతండా, నాగుర్లగడ్డతండా, లేమామిడి, తొమ్మిదిరేకుల, కొత్తపేట, లింగందన, కేశంపేట, పాపిరెడ్డిగూడ, నిర్దవెళ్లి, నందిగామ మండలంలో మంచన్‌పహాడ్, నందిగామ, బుగ్గోనిగూడ, నర్సప్పగూడ, మేకగూడ, ఈదులపల్లి, కొత్తూరు మండలంలో గూడురు, కొత్తూరు(ముగ్గురు), సిద్దాపూర్, కుమ్మరిగూడ పాఠశాలల నుంచి ఉపాధ్యాయులు నగరబాట పట్టారు. కొందరు ఉపాధ్యాయులు డీఈఓ కార్యాలయంలో విధులు నిర్వహిస్తుండగా.. మరికొందరు తమ నివాస ప్రాంతానికి సమీపంలో ఉండే పాఠశాలల్లో పనిచేస్తున్నారు.

చనిపోయిందా.. చంపేశాడా?

- నాన్నే అమ్మను హతమార్చాడు: కొడుకు
- ఆమే ఉరివేసుకుంది: భర్త



జయ శవాన్ని పరిశీలిస్తున్న సీఐ రామకృష్ణ

ధారూరు: కట్టుకున్న భర్తే భార్యను కడతేర్చి ఉంటాడని మృతురాలి అక్క అనుమానం వ్యక్తం చేసింది. మా నాన్నే అమ్మను చంపాడని కొడుకు చెప్పాడు. కానీ.. తనే ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందని భర్త తెలపగా.. భర్తే హంతకుడని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేశారు. దీంతో ఆ ఇల్లాలి మృతి చర్చనీయాంశంగా మారింది. ఈ సంఘటన మండల పరిధి స్టేషన్‌ధారూరు గ్రామంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకోగా.. శనివారం వెలుగు చూసింది. వివరాలిలా ఉన్నాయి. స్టేషన్‌ధారూరు గ్రామానికి చెందిన గాజుల బాలకృష్ణ.. అదే గ్రామానికి జయను ఎనమిదేళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వారికి గణేశ్ అనే 7 ఏళ్ల కొడుకు ఉన్నాడు. తాగుడుకు బానిసైన బాలకృష్ణ.. భార్యను రోజు వేధిస్తుండేవాడు. జయ కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేది. శుక్రవారం రాత్రి దంపతుల మధ్య గొడవ జరిగింది. ఆ రాత్రి ఏం జరిగిందో కాని.. ఉదయానికల్లా.. ఆ ఇల్లాలు శవంగా మారింది. సంఘటనా స్థలిని సర్కిల్ సీఐ రామకృష్ణ, ఎస్ఐ సంతోష్‌కుమార్‌లు పరిశీలించారు. మృతురాలి అక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, విచారణలో వాస్తవాలు బయటపడతాయని ఎస్ఐ తెలిపారు.

నకిలీ మద్యం ధ్వంసం

అబ్దుల్లాపూర్‌మెట్: రూ.1.30 కోట్ల విలువైన నకిలీ మద్యం సీసాలను హయత్‌నగర్ ఎక్సైజ్ పోలీసులు ధ్వంసం చేశారు. 2022లో సంచలనం సృష్టించిన నకిలీ మద్యం కేసులో విచారణ చేపట్టిన ఎక్సైజ్ పోలీసులు దర్యాప్తులో భాగంగా ఒడిస్సాలోని అభయారణ్యంలో అనుమతులు లేకుండా తయారు చేస్తున్న నకిలీ మద్యం తయారీ కేంద్రంపై దాడి చేసిన విషయం తెలిసిందే. ఆ దాడిలో పట్టుబడిన సుమారు 3వేల లీటర్ల మద్యాన్ని పెద్దఅంబర్‌పేటలోని గోడౌన్‌లో భద్రపర్చారు. రసాయన పరీక్షలు నిర్వహించిన పోలీసులు.. నకిలీ మద్యంగా తేల్చారు. కేసు విచారణ ముగిసిన అనంతరం ఎక్సైజ్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం సరూర్‌నగర్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవీందర్‌రావు సమక్షంలో హయత్‌నగర్ సీఐ లక్ష్మణ్‌గౌడ్, ఇబ్రహీంపట్నం సీఐ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో హయత్‌నగర్ ఎక్సైజ్ స్టేషన్ పరిధి పెద్దఅంబర్ పేటలో మద్యం సీసాలను ధ్వంసం చేశారు. దీంతో పాటు వివిధ కేసుల్లో పట్టుబడిన 1,050 కేజీల నల్లబెల్లాన్ని మూసీ నదిలో పారబోసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీటీఎఫ్ సీఐ సత్యనారాయణ, ఎస్ఐలు వెంకన్న, యాదయ్య, హనుమంతు, సరళ, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.